

కవర్ స్టోరీ

# మనసు పొరల్లో.. యాదోఁకీ బారాత్



జ్ఞాపకం... మనసు పొరల్లో రికార్డ్ చేసిన ఓ సందర్భం మాత్రమే కాదు. అలా ఉండేందుకు మెదడేమీ హార్డ్ డిస్క్ కాదు. జ్ఞాపకంతోపాటు దాని తాలూకు ఉద్వేగాలు కూడా నిలిచి ఉంటాయి. రంగు, రుచి, వాసనలు తోడవుతాయి. తొలి జ్ఞాపకమైన అమ్మ చీర దగ్గర్నుంచీ, ప్రియురాలి ఎడబాటు వరకూ... ఇష్టమైన హోటల్లో ఇడ్లీ సాంబార్ నుంచి చివరిసారి తిరుపతికి వెళ్లిన ట్రైన్ వరకూ అన్నీ అద్భుతమైన జ్ఞాపకాలే! వాటిని తలుచుకుంటే ఏదో తృప్తి. ఆనాటి బాధ కూడా తెలియని సంతృప్తిని ఇస్తుంది. గత సంతోషాన్ని తలుచుకున్న కొద్దీ అది రెట్టింపవుతుంది. ఆలోచిస్తే ఆ జ్ఞాపకాలకు కూడా మనతోపాటు ఓ సమాంతర జీవితం ఉంటుందేమో! అవమానపడిన చోటే... గౌరవం దక్కితే ఓ అద్భుతమైన ముగింపు దక్కినట్టే కదా! శ్రమకోర్చి పెంచిన పిల్లలే మనల్ని పసిపాపల్లా సాకితే ఓ వలయం పూర్తయినట్టే కదా! అందుకే ఈ నోస్టాల్జియా గురించి ఓసారి మాట్లాడుకుందాం. సాధారణంగా నోస్టాల్జియా అంటే సానుకూలమైన జ్ఞాపకాలే అన్న అభిప్రాయం ఉంటుంది. కానీ ప్రతి ముఖ్యమైన గురుతూ పదిలమే. మన ఉనికిలో భాగమయ్యే ఆ జ్ఞాపకాలు మన వ్యక్తిత్వం మీదా, ఆరోగ్యం మీదా అనూహ్యమైన ప్రభావాన్ని చూపిస్తాయని అంటున్నారు. మరి ఆ జ్ఞాపకాలే లేని పరిస్థితులు వచ్చేస్తే ఎలా? అదీ ఆలోచించాల్సిందే!

... కె.సహస్ర